# ఎగతాళి

కృపాణధారియైన సైనికుడిలా దూసుకుపోతున్న రామారావు కాళ్ళకి డొంక తీగలా అడ్డం పడ్డాడతను.

"బాబూ! అన్నం తిని రెండు రోజులైంది బాబూ...."

గబగబా వెళ్తున్న రామారావుకి బిచ్చగాడి దయనీయమైన ఆకలి అభ్యర్థన విపరీతమైన చిరాకుని తెప్పించింది.

"జరుగు ప్రక్కకి...." అసహనంగా అరిచాడు.

"బాబూ! ఒక్క పది పైసలు...."

''తప్పుకో...." రామారావు కోపం తారస్థాయికి నందుకుంది.

గొంగళి పురుగుని ఛీదరించుకున్నట్లు అతన్ని ఛీదరించుకుంటూ ముందుకు కదిలాడు.

అతను ఆ సందు చివరికి వచ్చేసరికి దూరంగా వస్తున్న పెద్ద పూరేగింపు కనిపించింది.

అతని కన్నుల్లో ఆనందపు నక్షత్రాలు వెలిగాయి. మనసులో పుత్సాహం పెల్లుబికింది.

బడా సినిమా నటులు కొందరు పేదలకోసం నిధిని సేకరించ డానికి బయల్దేరతీసిన రాలీ అది!

వాళ్ళు జోలెపట్టుకుని రోడ్లవెంట నడుస్తుంటే జనాలు వేలం వెర్రిగా పరుగులెత్తుకుంటూ వెళ్ళిమరీ వాళ్ళకు చందాలు ఇస్తున్నారు.

అంతా కోలాహలం....

ఆ తారల దృష్టిలో ఇతరులకన్నా తాము ఎదగాలనే వుద్దేశంతో ప్రజలు పోటీపడి ఒకళ్ళకన్నా మరొకళ్ళు ఎక్కువగా చందా లిస్తున్నారు.

రామారావు అంతమందిలో నుంచి అభిమన్యుడిలా దూసుకుంటూ తన అభిమాన తార దగ్గరకు వెళ్ళాడు. జేబులో వున్న వాటన్నింటినీ తీసి ఆమె జోలెలో వేసాడు. అంతటితో ఆగకుండా చేతినున్న వాచీ కూడా తీసివేశాడు.

ఇవతలికి వచ్చిన అతడిని ఇందాకటి బిచ్చగాడే "బాబూ! ధర్మం" అంటూ అడిగాడు అతడు తనని ఎగతాళి చేస్తున్నట్లనిపించి ఛెళ్ళున చెంపదెబ్బ కొట్టాడు.

(ఆంధ్రజ్యోతి వారపత్రిక)